

# నాటీ నా డార్లింగ్! – శర్మ. సి.హెచ్.

## "బో టనీ క్లాసు వుంది, మ్యాటినీ ఆట వుంది దేనికో ఓటు చెప్పరా .... హిస్టరీ లెక్చరుంది, మిస్టరీ పిక్చరుంది సోదరా ఏది బెస్టురా......"

'శివ' సినిమాలో పాటని మా ఫస్ట్ బి.ఎ. క్లాసులో ఆడ, మగ పిల్లలంతా పాడుతూ, బెంచీల పైకెక్కి స్టెప్స్ వేసి అల్లరి చేస్తూంటే, నేను ఓ మూలగా కూర్చుని శ్రద్ధగా ఇంగ్లీష్ టెక్స్టుబుక్ చదువుకుంటున్నాను.

"హసీనా ఆవో! తుమ్ భీ హమారే సాథ్ నాచో ఔర్ గావో" అని లతిక నన్ను పిలిచింది, డాన్స్ చేస్తుంటే పైకెగురుతున్న స్కర్టుని క్రిందికి లాక్కుంటూ.

"కమాన్ యార్–యూ ఆల్సో జాయిన్ విత‌జ్" పోజుగా ఇంగ్లీషులో అన్నాడు జాక్సన్.

నేనో చిరునవ్వును వాళ్ళకి సమాధానంగా పారేసి మళ్ళీ పుస్తకంలో దూరిపోయాను.

సరిగ్గా అదే సమయంలో మా కొత్త ఇంగ్లీషు లెక్చరర్‌గారు క్లాసులోకి అడుగుపెట్టారు. పట్టుమని పాతికేళ్ళు కూడా వుండని ఆయన అచ్చం కమల్‌హాసన్‌లా వున్నారు. ఎటువంటి అమ్మాయినైనా అయస్కాంతంలా ఆకర్షించగల అద్భుతశక్తి ఆయనలో దాగివుందంటే అతిశయోక్తి కాదు.

ఆయన్ని చూసి కూడా మావాళ్లంతా చూడనట్లుగా నటిస్తూ మరింత బిగ్గరగా పాడుతూ గొడవ చేయసాగారు.

నేను మాత్రం లేచి నిలబడి 'విష్' చేశాను.

ఆయన నా వద్దకు వచ్చి "వెరీగుడ్ బిహేవియర్. కీప్ ఇట్ అప్!" అంటూ కాంప్లిమెంట్స్ ఇచ్చేశారు.

మళ్ళీ ఆయన తన సీటు వద్దకు వెళ్ళి "డియర్ స్టూడెంట్స్" అని గట్టిగా అరిచారు. దానికి సమాధానంగా పిల్లికూతలు, నక్క అరుపులు వినిపించాయి.

అప్పుడాయన డస్టర్‌తో టేబుల్‌పై గట్టిగా కొట్టేసరికి క్లాసంతా ఒక్కసారిగా నిశ్శబ్దమైపోయింది.

"డియర్ స్టూడెంట్స్–ఐయామ్ యువర్ న్యూ ఇంగ్లీష్ లెక్చరర్. మై నేమ్ ఈజ్ చక్రవర్తి" గంభీరంగా చెప్పారాయన.

"ఏ చక్రవర్తి బాబూ–అశోక చక్రవర్తా? అక్బర్ చక్రవర్తా?" ఎవరిదో గొంతు వినిపించింది కానీ మనిషి కనపడలేదు.

"యస్ – అశోకచక్రవర్తి!"

"ఏ సమ్రాజ్యానికి సార్?" మునిపంటితో పెదవిని కొరుకుతూ మత్తుగా అడిగింది లతిక.

"ఈ కాలేజీ సామ్రాజ్యానికి".

అబ్బో సార్ ఘటికులే. ఇన్నాళ్ళకి వీళ్ళ ఆటలు కట్టించే లెక్చరర్ వచ్చారని మనసులోనే ఆనందించాను.

ఆయన అందరినీ పరిచయం చేసుకోవడం ప్రారంభించారు. ఒక్కొక్కరే లేచి నిలబడి తమ పేర్లు చెప్పి పరిచయం చేసుకుంటున్నారు.

ఇంతలో నా వంతు వచ్చింది. లేచి నిలబడి సిగ్గుతో చెప్పలేక నేలచూపులు చూస్తుండిపోయాను. మా సార్ స్వయంగా నా బెంచీ వద్దకు వచ్చి "ఫర్వాలేదు చెప్ప సిగ్గెందుకు?" అనడంతో– తలపైకెత్తి చూశాను.

ఆసమయంలో ఆయన నా కళ్ళల్లోకే సూటిగా చూస్తూ కన్పించడంలో నేను కూడా అప్రయత్నంగా ఆయన్నే చూస్తూ శిలాప్రతిమలా నిలబడిపోయాను.

వెనకాల ఎవరో ఏదో డైలాగ్ కొట్టడంతో ఈ లోకంలోకి వచ్చిన నేను "బేగం... హసీనా బేగం" అని తడబడుతూ పేరు చెప్పేశాను.

"వెరీ స్వీట్ నేమ్" అన్నారాయన.

ఆ మాటకి నామనసంతా దూదిపింజలా తేలికైపోయింది.మదిలో ఏవో తెలియని కోరికలు పుట్టాయి. ఆయనంటే ఓ విధమైన 'ఇది' ఏర్పడింది.

తర్వాత ఆయన రకరకాల ప్రశ్నలడుగుతూ నా బెంచీ వద్దే నిలబడేసరికి, వెనకాల ఎవరో "ఇక పాఠం మొదలెడతారా సార్?" అనడిగారు.

"నాట్ నౌ..." అన్నారు సర్. బహుశా అది ఆయన ఊతపదమేమో, క్లాస్‌కొచ్చినప్పటి నుంచి దాదాపు పదిసార్లయినా అనుంటారు.

ఇంతలో గంట మోగడంతో మా సార్ వదల్లేక వదల్లేక మా క్లాసు వదిలివెళ్ళారు. దానిక్కారణం నాకు మాత్రమే తెలుసు.

* * *

రోజులు గడుస్తున్నాయి.

మా ఇద్దరి పరిచయం ప్రేమగా రూపాంతరం చెందింది. ఇప్పుడు సార్ క్లాస్‌లో ఏ లెసన్ చెప్పినా నా బెంచీ వద్ద నిలబడి నా కళ్ళలోకి చూస్తూ చెప్పాల్సిందే.

షేక్స్‌పియర్ నాటకాల్లోని రొమాంటిక్ లవ్ సీన్లయితే ఇక చెప్పనే అక్కర్లేదు. అవి వర్ణించి చెప్పేటప్పుడు మేమిద్దరం ఊహాలోకాల్లో విహరించడం మామూలైపోయింది. లెసన్స్ అర్థమైనా అర్థంకానట్లు నటించి ఏవో డౌట్స్ వున్నాయన్న వంకతో ఆయన రూమ్‌కెళ్ళి గంటలతరబడి గడపడం నాకు నిత్యకృత్యమైంది. ఆదివారాలు, సెలవుల్లో అయితే పార్కులు, బీచ్‌లు, సినిమాలు, షికార్లతో కాలం గడిపేస్తున్నాం. చివరికి మా ప్రేమ వ్యవహారం కాలేజీ గోడలవరకు

రావడంతో నాకు కొంచెం భయమేసింది.

వెంటనే చక్రవర్తి రూమ్మేట్ళి "మనం అర్జెంటుగా పెళ్ళి చేసేసుకోవాలి సార్" అన్నాను ఆందోళనపడుతూ.

"నాట్ నౌ డార్లింగ్..." అని సున్నితంగా నా అభ్యర్థనను కొట్టిపారేశారు.

ఆ మాట ఆయన నోటివెంబడి వచ్చేసరికి నా గుండె గుభేలుమంది.

"అదేమిటండీ ప్రేమించేటప్పుడు తప్పకుండా పెళ్ళి చేసుకుంటానని చెప్పారుగా, మరిప్పుడు మాట దాటేస్తున్నారేం?" ఏడుపొచ్చినంతపనైంది నాకు.

"అది కాదు డార్లింగ్ – అమ్మానాన్నలకి కూడా చెప్పాలిగా!"

"అంటే – వాళ్ళు మనిద్దరి మతాలు వేరని అడ్డుపడితే..."

"అటువంటి సమస్య రానే రాదు, ఒకవేళ వచ్చినా వాళ్ళతో తెగతెంపులు చేసుకొని వచ్చేస్తా!"

ఆ మాట నాకు ప్రాణం పోసింది.

ఫస్టియర్ ఎగ్జామ్స్ అయిపోయాయి. సెలవులిచ్చేశారు.

మా సార్ వైజాగ్ వెళ్ళిపోయారు.

* * *

ఎన్నాళ్ళనుంచో నేను ఎదురుచూసిన రోజు రానే వచ్చింది. ఆరోజే సెకండియర్ క్లాసులు బిగినయ్యాయి.

నేను ఆతృతగా సార్ వద్దకెళ్ళి "పెళ్ళి విషయం ఏమైంది?" అని అడిగాను. దానికాయన "నాట్ నౌ డార్లింగ్ – ఆఫ్టర్ ఫైనలియర్" అంటూ తప్పించుకున్నారు.

కానీ, నా మనసులో వాళ్ళమ్మానాన్నలు వద్దన్నారేమోనన్న అనుమానపు బీజం మొలకెత్తింది.

అయినా ప్రేమ బంధాన్ని తెంచుకోలేని బలహీనత నాలో బలీయంగా ఏర్పడడంతో యథాప్రకారం ఆయన్ని ఎడాపెడా ప్రేమించేస్తున్నాను.

ఒకరోజు సాయంత్రం నేను మామూలుగా సార్ రూమ్‌కెళ్ళాను. ఇద్దరం కబుర్లలోపడి

● "మిమ్మల్ని సిగరెట్లు, తాగుడూ రెండూ మాని దగ్గుమందు తీసుకోమన్నాను తీసుకుంటున్నారా?" అనడిగింది దగ్గుతున్న దుర్గారావుని ఆయన శ్రీమతి.

"ఒక్కసారి స్వాన్ తాగాను. బాగోలేదు"

"అయితే ఏం చేశారు?"

"ఆ దగ్గు మందు తాగేకన్నా దగ్గడమే బావుంది నాకు." – జి. మానస




టైమే మర్చిపోయాం. అప్పటికే రాత్రి పదయింది. ఇక బయల్దేరదామని లేచేసరికి బయట జోరున వర్షం పడుతూంది. తగ్గితే వెళ్ళొచ్చులే అని అక్కడే వుండిపోయాను. వర్షం తగ్గకపోగా మరింత పెరిగింది. చలి ఎముకల్ని కొరికేస్తూంది. నాలో ఆందోళన ప్రారంభమైంది. ఇంతలో పెద్దగా ఓ ఉరుము ఉరిమింది – మరెక్కడో పిడుగు పడిన భయంకర శబ్దం–

నెనొక్కసారిగా భయపడి గబుక్కున సార్‌ని గట్టిగా కౌగలించుకున్నాను. ఆ కౌగిలిలో ఏదో తీయని హాయి, అనుభూతిని మొదటిసారిగా చవిచూశాను. మా ఇద్దరి ఉచ్ఛ్వాసనిశ్వాసాలతో రూమ్ వేడెక్కిపోయింది. ఆ తర్వాత నాకు తెలియకుండానే నా సర్వస్వాన్ని సార్‌కి అర్పించాను. అంతా అయిపోయాక తెలివొచ్చిన నేను ఏడుస్తూ కూర్చుండిపోయాను. సార్ నన్ను ఓదార్చి, "నువ్వేమీ కంగారుపడొద్దు, ఫైనలియర్ అయ్యాక తప్పకుండా చేసుకుంటానన్నాగా" అన్నారు దగ్గరికి తీసుకుంటూ.

రెండు నెలలయ్యాక తెల్సింది – నేను నెలతప్పానని. వెంటనే సార్ దగ్గరకెళ్ళి విషయం చెప్పి వెంటనే పెళ్ళి చేసుకుందామని తొందరపెట్టాను.

ఆయన మాత్రం తాపీగా "నాట్ నౌ డార్లింగ్" అంటూ పాత డైలాగే చెప్పారు. ఇన్నాళ్ళూ మా ప్రేమ వ్యవహారమైతే గుట్టుగా వుంచగలిగాను కానీ, పెరుగుతున్న గర్భాన్ని మాత్రం దాచలేనుగా – అందుకే అన్ని విషయాలూ డాడీతో చెప్పేసి ఏడ్చేశాను.

"ఆ హిందువుతో నీకు నిఖానా? మైమాన్‌తా నహీ!" అంటూ డాడీ నా మీద చిందులు తొక్కారు.

"అదేంటి డాడీ హిందువుని నిఖా చేసుకుంటే తప్పేమిటి? హిందువులు పీల్చేగాలి ముస్లింలు పీల్చే గాలీ ఒకటి కాదా? వాళ్ళు తాగే నీరు, మనం తాగే నీరు ఒకటి కాదా? వాళ్ళలో ప్రవహించే రక్తం, మనలో ప్రవహించే రక్తం వేర్వేరు రంగుల్లో వుంటుందా? చెప్పండి? అసలు స్వచ్ఛమైన ప్రేమకి ఈ మతాలు, కులాలు అడ్డురావు డాడీ – ఇవన్నీ కేవలం మనం కల్పించుకున్నవే! నేను నిఖా అంటూ చేసుకుంటే చక్రవర్తిసార్‌నే చేస్కుంటా–లేకపోతే అసలు నిఖానే చేసుకోను" అని కరాఖండిగా చెప్పేసరికి డాడీ మెత్తబడ్డారు. సరేనని అన్నారు.

మర్నాడు డాడీని తీసుకుని కాలేజీకెళ్ళేసరికి మా సార్ జాబ్‌కి రిజైన్‌చేసి వెళ్ళిపోయారని తెల్సింది.

ఇక డాడీ సార్‌ని మోసగాడు, నయవంచకుడు అని ఎడాపెడా తిట్టేశారు.

"డాడీ! సార్ అలాంటివారు కాదు, చాలా మంచివారు. అసలు అర్జెంట్‌గా ఎందుకు వెళ్ళిపోయారో అర్థం కావడంలేదు" పెరుగుతున్న గర్భాన్ని చూస్తూ ఏడ్చాను.

వెంటనే డాడీ ఆయన అడ్రస్ తీసుకుని వైజాగ్ బయల్దేరారు. వైజాగ్ వెళ్ళొచ్చిన మా డాడీ చెప్పిన వార్త విని నా నెత్తిన పిడుగులు పడినట్లయింది. కాళ్ళ క్రింద భూమి పగిలిపోతున్నట్లనిపించింది – అప్పటికే సార్‌కి పెళ్ళయిపోయింది, ఓ బాబు కూడా వున్నాడట!

"నహీ! ఐసా కభీ భీ నహీ హోసక్‌తా! అలా ఎన్నటికీ జరగడానికి వీల్లేదు!" అంటూ గుండెలు బాదుకుంటూ ఏడవసాగాను.

"హసీనా డార్లింగ్ క్యాహువా? ఎందుకే దుస్తున్నావ్?" ఎవరో భుజం తడుతూ లేపారు.

లేచి చూసేసరికి పక్కన చక్రవర్తిసార్. నా నోటంబడి మాటరాక బిత్తరచూపులు చూస్తుండిపోయాను. సార్ లేచి మంచినీళ్ళు తెచ్చిచ్చి "బోలో హసీనా, క్యాహువా?" అనడిగారు.

"నన్నొకసారి గట్టిగా గిల్లండి" అన్నాను.

సార్ – కాదు మావారు గట్టిగా గిల్లడంతో ఈ లోకంలోకి వచ్చాను.

"ఇదంతా కలా? అయ్యబాబోయ్ ఎంత భయంకరమైన కల? ఎంత భయపడి వచ్చానో తెలుసా?"అంటూ మావారి ఒళ్ళో తలపెట్టుకుని పడుకున్నాను.

ఆయన నా తల నిమురుతూ "అదేమిటో నాక్కూడా చెప్పొచ్చుగా" అన్నారు గారాలుపోతూ!

"నిన్నరాత్రి మనం సెకండ్‌షో 'సుందరకాండ' సినిమాకెళ్ళాం కదండీ – ఆ కథ కూడా ఇంచుమించు మన జీవిత కథలా వుండడంతో రాత్రంతా ఆలోచిస్తూ పడుకున్నాను. నిద్రలో మన పాత విషయాలన్నీ – మన పరిచయం దగ్గర్నుంచి అన్ని సంఘటనలు 'కల' రూపంలో వచ్చాయి..."

"మరయితే నీ ముఖంలో ఈ ఆందోళన, కంగారు ఎందుకొచ్చినట్లు?" అన్నారాయన.

"మన జీవితంలో అన్నీ సవ్యంగా జరిగినట్లు కలలో కూడా జరిగివుంటే బాగానే వుండేది – కానీ చివర్లో ఓ అపశృతి పలకడంతో కలకాస్తా చెదిరి పీడకలగా మారింది" అంటూ ఆయన్ని గట్టిగా కౌగలించుకున్నాను.

అప్పుడాయన "నాట్ నౌ డార్లింగ్..." అంటూ నిద్రలేచి కూర్చున్న మా బాబుని చూపిస్తుంటే నేను నవ్వాపుకోలే నవ్వేశాను. మావారు, బాబుకూడా నాతో శృతికలిపారు.

●